క్లుప్తంగా

పురిటిపెంటలో 104 వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2లో మంగళవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది 52 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఎండల తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వైద్యాధికారి సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన మెరకతల్లి జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

మెరకముడిదాం: మూడురోజుల పాటు నిర్వహించిన మండల కేంద్రంతో పాటు సోమలింగాపురం, ఎం.పాలెం గ్రామాల ఇలవేల్పు మెరకతల్లి అమ్మవారి జాతర మంగళవారం ముగిసింది. ఈ మూడు గ్రామాలకు మధ్యలో అమ్మవారి ప్రధాన ఆలయం ఉంది. జాతరలో ఆఖరి రోజు కావడంతో అమ్మవారి ని దర్శించుకునేందుకు మూడు గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద సుమారు 3 వేల మందికి ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



జెండా ఊపి క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 605 హ్యాండ్ బోర్లకు మరమ్మ తులు చేయించనున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిశోర్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నామని జెడ్పీటీసీ గార తవుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో నిర్వ హించే ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేడుకల అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమానికి తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం పద్మావతి

లక్కవరపుకోట: కొట్యాడ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు తలారి గ్రామానికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ సహకారంతో హెచ్‌ఎం బి.పద్మావతి మంగళవారం పరీక్ష సామగ్రి అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి,ఆంగ్ల ఉపాధ్యాయుడు గుమ్మడి శ్రీనివా సరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు.

నాలుగు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

కొత్తవలస: మండలంలో నాలుగు కేంద్రాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ జి.శ్రీదేవి తెలిపారు. ఈనెల 17న పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 11 ప్రైవేట్ పాఠశాలల నుంచి 923 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరికి కొత్తవలస హై స్కూల్, మోడల్ స్కూల్, వియ్యంపేట గురుకుల పాఠశాల, అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని ఓపీ జిందాల్ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించామని చెప్పారు. ఆమె వెంట హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు ఉన్నారు.

ఆరోగ్యానికీ పరీక్షే..

- ఈనెల 17 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు
- ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- సమతుల ఆహారం, సరైన నిద్ర అవసరమంటున్న వైద్య నిపుణులు

ఎస్.కోట నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల వివరాలు..

మండలం	స్కూళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్.కోట	23	896
ఎల్.కోట	8	508
వేపాడ	10	363
కొత్తవలస	19	916
జామి	15	627
మొత్తం	75	3,310



ధర్మవరం హైస్కూల్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

శృంగవరపుకోట: విద్యార్థి జీవితంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. పాఠశాల స్థాయి చదువుల పోరులో తమను తాము నిరూపించుకునే తుది ఘట్టం ఈ పరీక్షలు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయంటే ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రుల్లో ఒకటే టెన్షన్. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతుండగా..ఈ నెల 17వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈపబ్లిక్ పరీక్షలు ఇప్పుడు విద్యార్థుల ఆరోగ్యానికీ పరీక్షే అవుతున్నాయి.

మదిలో భయం

పదో తరగతిలో సాధించిన ఫలితాల ఆధారంగానే తదుపరి ఉన్నత చదువులు ఆధారపడి ఉంటాయి.భవిష్యత్ లక్ష్యాలు, వాటి సాధన, జీవితంలో స్థిరపడడం వంటి అన్నింటికి పదోతరగతే పునాది అన్న భావనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటున్నారు. అందువల్లనే పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, సబ్జెక్టు టీచర్లు, ట్యూషన్ సెంటర్ల నిర్వాహకులు, ఇలా అందరి దృష్టి పరీక్షల మీదనే. మంచి మార్కులు సాధించి తమను తాము నిరూపించుకోవాలన్న ఆరాటం విద్యార్థులదైతే...తమ సబ్జెక్ట్‌లో మంచి ఫలితాలు సాధించామన్న తృప్తి కోసం ఉపాధ్యాయులు, మార్కెట్‌లో మాదే హవా అని చెప్పుకోవాలని ప్రైవేటు విద్యాసంస్థలు ఇలా ప్రతి ఒక్కరూ తమకు తెలియకుండానే విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు.

వద్దనుకున్నా ఒత్తిడి తప్పడం లేదు

ఎంత వద్దనుకున్నా పరీక్షల వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. చాలామంది విద్యార్థులు అర్ధరాత్రి వరకు చదువుతూ మళ్లీ తెల్లవారు జామున లేచి పుస్తకం పడుతుండడంతో నిద్రలేమికి గురవుతున్నారు. నిద్రలేమితో వికారం, చిరాకు, నిరాశ, అలసట, ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి తగ్గడం, శరీరం చురుగ్గా లేకపోవడం, రోగనిరోధక శక్తి తగ్గడం, ఆందోళన, భయం, మతిమరుపు, ఒత్తిడి, గాబరా వంటి సమస్యలకు లోనవుతారని మానసిక వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యల బారిన పడకుండా రోజుకు 6 నుంచి 8గంటల నిద్ర అవసరమని, పరీక్షల ముందు ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.సమతుల ఆహారం, ఆకు కూరలు, పాలు, పండ్లు వంటివి విద్యార్థుల డైట్‌లో చేర్చాలని వైద్యులు చెబుతున్నారు. మంచి మార్కులు సాధించాలంటే విద్యార్థులకు పక్కా ప్రణాళిక అవసరం. ఇప్పటికే స్కూళ్లలో గ్రాండ్ టెస్టులు, డైలీ టెస్టులు, ప్రీ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఉన్న సమయాన్ని బట్టి రోజులో ఏ సబ్జెక్ట్‌కు ఎన్ని గంటలు కేటాయించాలన్న కచ్చితమైన ప్రణాళికతో చదువుకోవాలని, పాఠశాలలో, ఇళ్లలో ప్రశాంత వాతావరణం ఉండేలా టీచర్స్, పేరెంట్స్ విద్యార్థులకు సహకరించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒకదానికొకటి అవినాభావ సంబంధం ఉంటుంది. మనం తీసుకునే ఆహారం ఈరెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్షల వేళ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలున్న ఆహారం విద్యార్థులకు ఇవ్వాలి. రోజూ పాలు, పండ్లు ఇవ్వాలి. ఎక్కువగా ఆకు కూరలు, కాయగూరలు ఉండేలా మంచి సాత్వికాహారం అందించేలా చూసుకోవాలి.

– డాక్టర్ జి.హారిక, కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు

యోగా, ధ్యానం చేస్తే మంచి ఫలితం



ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలి. ధ్యానంతో సమయం వృథా అవుతుందన్న ఆలోచన సరికాదు. రోజుకు 20 నుంచి 30 నిమిషాలు సాధన చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. శారీరక, మానసిక ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది.

– శీలా కోటేశ్వరరావు, యోగా శిక్షకులు, మోక్షవిద్యయోగమందిర్, ఎస్.కోట

తల్లిదండ్రులే బలం కావాలి



పరీక్షల సమయంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులే బలం కావాలి. పరీక్షల వేళలో వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. వారిని టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. పౌష్టికాహారం అందించాలి. ఇంటి వద్ద చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలి, వారిలో ఉన్న భయాలు, బలహీనతలను వారికి తెలియచెప్పి వాటిని దూరం చేసేందుకు ఫ్రెండ్లీగా ఉండాలి.

– బి.నర్సింగరావు, ఎంఈఓ, ఎస్.కోట.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సాల్మన్‌రాజు

బొండపల్లి: విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి ఏ.వి.సాలమన్‌రాజు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. పీ–4 సర్వేపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ ఉద్యోగులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను ఈనెల 18 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా 20 శాతం కూ డా పూర్తిచేయలేకపోయారని పంచాయతీ కార్యదర్శులపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేయించే విషయంలో ఎందుకు వెనుకబడ్డారని ఎంపీడీఓ జి.గిరిబాలను ప్రశ్నించారు. గ్రామాల్లో సర్వే చేయడంతో పాటు సంక్షేమ పథకాలకు అర్హుల వివరాలు సేకరించాలని, లేకుంటే తర్వాత జరిగే పరిణామాలకు పంచాయతీ కార్యదర్శులే బాధ్యులవుతారని చెప్పారు. ప్రతీ ఉద్యోగిపై ప్రభుత్వ నిఘా ఉందని అన్నారు. అలాగే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ ఏ.రఘుపతిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల భద్రత ముఖ్యం



మాట్లాడుతున్న పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్

కొత్తవలస: పరిశ్రమల్లో పని చేసే కార్మికుల భద్రత చాలా ముఖ్యమని, వారికి తగిన భద్రతా పరికరాలను అందించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని విశాఖపట్నం పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ వి.సురేష్ అన్నారు. కంటకాపల్లి సమీపంలోని శారద మెటల్స్,ఎల్లాయిస్ కర్మాగారంలో భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పనిలోకి వెళ్లే ముందు భద్రతా పరికరాలను ధరించాలని,యాజమాన్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వారం రోజులుగా కార్మికులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్‌దాస్, జీఎంలు అనంత్ కుమార్, విజయ్ భాస్కర్, హెచ్‌ఆర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి వేతనదారుల ధర్నా



వేతనదారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అప్పారావు

లక్కవరపుకోట: ఉపాధి హామీ వేతనదారులకు పనిదినాలు పెంచాలని, ఇతర డిమాండ్లతో జిల్లా కేంద్రంలో బుధవారం మహాధర్నా నిర్వహించనున్నామని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు తెలిపారు. మండలంలోని గంగుబూడి గ్రామ సమీపంలో ఉపాధి పనుల వద్ద వేతనదారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు వేసవి అలవెన్స్ ఇవ్వాలని, బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న మహాధర్నాకు వేతన దారులు,వ్యవసాయ కూలీలు హాజరు కావాలని కోరారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరండి



కొత్తవలస: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

- నేడు జిల్లా కేంద్రంలో నిరసన

విద్యార్థులు, యువతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగడుతూ జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు పిలుపునిచ్చారు. కొత్తవలస, గంట్యాడ, దత్తిరాజేరు, బొండపల్లి,జామి, వేపాడ మండలాల్లో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు మంగళ వారం 'యువత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్యరంగాలతో పాటు అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో బడికి పిల్లలను పంపించే తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు చొప్పున జమ చేశాకని తెలిపారు. డిప్లమా,ఇంజినీరింగ్, తదితర ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఫీజులు చెల్లించారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకొచ్చారని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు స్కూల్‌కి వెళితే అంతమందికీ తల్లికి వందనం ఇస్తామని ఎన్నికల్లో హామి ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అయినా ఇంతవరకు అమలు చేయలేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ అని చెప్పారని, ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని ఇందులో ఏదీ అమలు చేయలేదన్నారు. వీటిన్నింటిపై విద్యార్థులు, యువత తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని చెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్



జామిలో..



వేపాడలో..



బొండపల్లిలో..



దత్తిరాజేరులో..



గంట్యాడలో...

ఉపాధ్యాయినులకు సన్మానం



యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎస్.కోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండలశాఖ, హెచ్‌ఎం టి.విజయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయినులను మండల యూటీఎఫ్ శాఖ మహిళా విభాగం నాయకులు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.అతిథులుగా యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు కె.విజయగౌరి, ఎస్.కోట డిప్యూటీ తహసీల్దార్ సునీత, ఎంఈఓలు బి.నర్సింగరావు, పి.జి.లక్ష్మి, తిమిడి హైస్కూల్ హెచ్‌ఎం బి.ప్రకాశరావు, యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

– శృంగవరపుకోట

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



తలారి గ్రామంలో అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉల్లాసంగా, ఉత్సా హంగా సాగాయి. పోటీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 11 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఎడ్ల బళ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

– లక్కవరపుకోట

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పెట్టుకున్నామని గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రూపవతి చెప్పారు. వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆమె సంద ర్శించారు. పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడి, 17వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటర్ విద్యార్థినులను పరీక్షలు ఎలా రాస్తున్నారని అడిగారు. టీచర్స్‌కు సంబం ధించిన అకడమిక్ రిజిస్టర్లను పరిశీలించారు. రాత్రివేళ స్టడీ అవర్స్‌లో విద్యార్థినులకు పాలు, బిస్కెట్లు, పండ్లు అందజేయాలని ప్రిన్సిపాల్ యు.ఉషారాణిని ఆదేశించారు. ఆమె వెంట వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి,తదితరులు ఉన్నారు.

– శృంగవరపుకోట

పశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి



పశుసంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించామని జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు(జేడీ) డాక్టర్ వై.వి.రమణ తెలిపారు.దత్తి గ్రామంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వ హించడంతో పాటు లేగదూడల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు.పాడి పశువులకు వైద్య సేవలు అందించి, ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేశారు.లేగ దూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ పశుపోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాడిరైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.ఏడీఏ చంద్రశేఖర్, దత్తిరాజేరు పశు వైద్యాధికారి అవినాష్, దినేష్, గ్రామపెద్దలు బోడసింగి సత్తిబాబు, రామస్వామి పాల్గొన్నారు.

– దత్తిరాజేరు

మామిడిలో నల్ల తామరపురుగు ఉధృతి



శృంగవరపుకోట: జామి మండలంలోని అలమండలో మామిడి తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి జమదగ్ని, తదితరులు

లక్కవరపుకోట/ శృంగవరపుకోట: మామిడి పంటలో నల్ల తామరపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఏ.వి.ఎస్.వి.జమదగ్ని రైతులకు సూచించారు. ఎల్.కోట మండలంలోని భీమాళి, జామి మండలంలోని అలమండ గ్రామాల్లో ఎల్.కోట, ఎస్.కోట హెచ్‌ఓలు పప్పు పద్మ, టి.అనితతో కలిసి మామిడితోటలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం పొడిగా ఉండి, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం మూలంగా నల్లతామర పురుగులు పంటను ఆశిస్తున్నా యన్నారు. ఇవి పూలు, కొమ్మలు, పిందెల నుంచి రసం పీల్చడం వల్ల పంటకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. నష్ట నివారణకు ఎకరా విస్తీర్ణానికి 34 మిల్లీ లీటర్ల ఎక్స పోనస్ మందును 140 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పండు ఈగ వల్ల పంట కు నష్టం జరగకుండా ఉండేందుకు మామిడి పిందెలు నిమ్మకాయలంత పరిమాణంలో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్స్ తొడగాలన్నారు. ఫ్రూట్ కవర్లను ప్రభుత్వం 50శాతం రాయితీపై అందజేస్తోందని తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ సహాయకులు చంటి,సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలకు డిమాండ్



జామి పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: జామి మండలంలోని అట్టాడ గ్రామ సర్పంచ్ అమ్మన్నదొరపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసు లను డిమాండ్ చేశారు. మంగళవారం జామి పోలీస్‌స్టేషన్ వద్ద మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, తదితరులు మాట్లాడుతూ టీడీపీ నాయకులు గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని పాడుచేస్తూ దాడులకు తెగబడుతూ, రాక్షస రాజకీయాలకు తెర తీస్తున్నారని మండిపడ్డారు. సోమవారం అట్టాడ రామాలయం వద్ద గ్రామ పండగ నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశానికి పెద్దలు పిలిస్తే సర్పంచ్ అమ్మన్నదొర హాజరయ్యారని, సమావేశం జరుగుతుండగా గ్రామానికి చెందిన చిట్టిబాబు అనే వ్యక్తి సర్పంచ్‌పై దాడి చేసి, ఆయన చొక్కా చింపి, దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని వివరించారు. సర్పంచ్ అమ్మన్నదొర అదే రోజు రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, అదే సమయంలో టీడీపీ నాయకులు మూకు మ్మడిగా స్టేషన్‌కు వచ్చి సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తి చేత తప్పుడు ఫిర్యాదు ఇప్పించారన్నారు. సర్పంచ్‌పై కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇటువంటి ఘటనలను తామంతా ఖండిస్తున్నామని చెప్పారు. పోలీసులు తక్షణం సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఎస్.అరుణ, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, పాండ్రంకి సంజీవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కిలారి సూర్యారావు, సర్పంచ్‌లు ఏ. సుబ్రహ్మణ్యం, నెక్కల రమణ, రవికుమార్, సూరిదేముడు, వాక అప్పారావు, వెంకటరావు, ఎంపీటీసీ నర్సినాయుడు, అప్పలరాజు,తదితరులు పాల్గొన్నారు.